# ఈ మాసంలో వ్యవసాయం

## పశువుల పేడ, మూత్రంతో ద్రావణం తయారు చేయు పద్ధతి

- ఒక తొట్టెలోనికి 5 కిలోల పశువుల పేడ, 5 లీటర్ల పశువుల మూత్రం, 5 లీటర్ల నీటిని తీసుకొని బాగా కలిపి తొట్టపై మూతపెట్టి 4-5 రోజుల వరకు మురగపెట్టాలి.
- ఈ మిశ్రమాన్ని ప్రతి దినము ఉదయం, సాయంత్రం వేళల్లో బాగా కలియబెట్టాలి.
- 4-5 రోజుల మిశ్రమం మురిగిన తరువాత వడబోసి 100-150 గ్రాముల సున్నాన్ని కలపాలి.
- ఈ విధంగా తయారు చేసిన ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరా పైరుకు పిచికారి చేయాలి.
- దీనివలన ఉపయోగాలు :
- ఈ ద్రావణాన్ని పైర్లపై పిచికారి చేస్తే రెక్కల పురుగులు పైర్లపై గ్రుడ్లను పెట్టవు.
- వివిధ రకాల తెగుళ్ళ నుండి పైరుకు కొంతవరకు రక్షణ కల్పిస్తుంది.
- పైర్ల ఆకులు ఈ ద్రావణం ద్వారా లభించు నత్రజనిని గ్రహించుట ద్వారా మొక్కలు ఆరోగ్యంగా ఉండి పచ్చగా కనపడతాయి.
- ఈ ద్రావణాన్ని అన్ని పంటల పైన నారుమళ్ళపైన పిచికారి చేసుకొని లబ్ధిపొందవచ్చు.

## ఎర్రగొంగళి పురుగు జీవిత దశలు

| | | |
|---|---|---|
| తల్లి పురుగు దశ | - | 5 - 10 రోజులు |
| గ్రుడ్డు దశ | - | 2 - 3 రోజులు |
| గొంగళి పురుగు పైరును నష్టపరచే దశ | - | 40 - 50 రోజులు |
| ప్యూపా / నిద్రావస్థ దశ | - | 10 - 12 నెలలు |

ఒక్కొక్క సంవత్సరంలో ఆగష్టు మాసములో ప్యూపా దశలోనికి పోయిన గొంగళి సెప్టెంబరు నెలలో పడు అధిక వర్షాలవలన ప్యూపాదశ పూర్తి కాకుండగానే తల్లి పురుగు వెలుపడి మరల జీవిత దశలు మొదలవుతాయని తెలియవచ్చినది. ఇది శాస్త్రీయంగా నిర్ధారణ కాలేదు.

### పురుగు లక్షణాలు :

**గ్రుడ్లు :** తల్లి పురుగు గ్రుడ్లను గుంపులుగా, రాళ్ళపైన, గోడలపైన, పొలం గట్లపైన, కలుపు మొక్కలపైన, పైర్ల ఆకుల అడుగు భాగాన పెడుతుంది.

**లార్వా :** గ్రుడ్ల నుండి పొదగబడిన తరువాత ఇవి ఆకుల యొక్క పచ్చదనాన్ని గోకి తింటుంది. ఈ దశలో లార్వాపైన చాలా తక్కువ వెంట్రుకలు కలిగి ఉంటాయి.

చిన్న లార్వాలు పైరు ఆకులను తింటూ పెరిగి పెద్దవై శరీరంపైన దట్టంగా బొచ్చు ఏర్పడి గుంపులు గుంపులుగా ఒక పొలంలోనుంచి యింకొక పొలానికి వలస పోవడం జరుగుతుంది. పెరిగిన లార్వాలు ఆహారం కొరకు ఆకులను, లేదా కొమ్మలను తిని మొక్కలను కాడలుగా మార్చివేస్తుంటాయి. ఈ సమయంలో పురుగు మందులు వాడినా, దట్టంగా బొచ్చు ఉన్నందున, పని చేయడం అన్నది జరుగదు.

**ప్యూపా :** లార్వాలు 40 - 50 రోజుల తర్వాత మెత్తగా మరియు యిసుకతో కూడిన మట్టి ఉన్న ప్రాంతాలలో భూమిలోనికి ప్రవేశించి తన బొచ్చు వెంట్రుకలతో కవచంగా ఏర్పరుచుకొని నిద్రావస్థలోనికి జారుకుంటాయి. భూమి మెత్తదనాన్నిబట్టి ఇవి భూమిలోనికి ఆరు అడుగుల లోతు వరకు వెళ్ళి నిద్రావస్థలో ఉంటాయి.

**తల్లి పురుగు :** జూన్, జూలై నెలలో మంచి వర్షాలుపడినపుడు బొరియ నుండి బయటకు రావడం జరుగుతుంది. కానీ అరకొర వర్షాల వలన ఇవి బయటకు రాక సెప్టెంబరు / అక్టోబరు నెలలో పడు భారీ వర్షాలకు బయటకు రావడం జరుగుతుంది.

వర్షం పడిన మరుసటి రోజు రాత్రి 7 గంటల నుండి 10 - 11 గంటల సమయంలో రెక్కల పురుగులు దీపాలు, మంటల కాంతికి ఆకర్షింపబడి అందులో పడి చనిపోతాయి. ఒక్కొక్క ఆడ చిలుక మంటలోపడి చనిపోవుటద్వారా ఒక్కొక్కపురుగు 500-1000 గుడ్లు పెట్టకుండా నిరోధించిన వారమవుతాము. దీని ద్వారా సరిఅయిన సమయంలో లార్వాలను నాశనం చేయగలం.

## ఎర్ర గొంగళి నియంత్రణకు పాటించవలసిన యాజమాన్య పద్ధతులు :

- **వేసవి దుక్కులు :** దీనివలన ప్యూపాలు బయటపడి సూర్య రశ్మికి చనిపోతాయి. పక్షులు కూడా వాటి ప్యూపాలను తింటాయి.
- **సామూహిక మంటలు :** జూలై వానలు పడిన మరుసటి రోజు సాయంత్రం 7 గంటల నుండి 11 గంటల మధ్య సామూహికంగా మంటల కాంతికి ఆకర్షింపబడి ఆ మంటలలో పడి చనిపోతాయి.
- **దీపపు ఎరలు :** తల్లి పురుగులు దీప కాంతికి ఆకర్షింపబడి, దీపం క్రింద అమర్చిన కిరోసిన్ కలిపిన నీటి తొట్టెలో పడి చనిపోతాయి. ఒక తల్లి పురుగును పై విధంగా చంపితే 200 నుండి 1000 లార్వాలను నివారించినట్లే. దీపపు ఎరలు, సామూహిక మంటలు ప్రతి సారి వర్షం పడిన మరుసటి రోజు నుండి వరుసగా 3 రాత్రులు వేయవలసి ఉంటుంది. ఈ ప్రక్రియ జూలై నుండి సెప్టెంబరు నెల ఆఖరి వరకు చేపట్టాలి.

  ఎర పంటగా అలసందలు మేరలలో, అంతర పంటగా విత్తుకోవాలి. గొంగళ్ళ తల్లి పురుగులు అలసంద ఆకుల అడుగు భాగాన గ్రుడ్లు పెడుతాయి. ఆ గ్రుడ్ల సముదాయాన్ని ఏరిపారేయాలి. గ్రుడ్ల నుండి పొదగబడి గొంగళి చిన్నగా ఉన్నపుడు వేరుశనగ పైరు పైనేగాక చుట్టుప్రక్కల గడ్డి, ఆకు అలముల మీద పచ్చిమిర్చి + వెల్లుల్లి ద్రావణం పిచికారి చేస్తే ఏ పురుగు మందులు దీనికి సాటిరావు.

## పచ్చిమిర్చి + వెల్లుల్లి ద్రావణం తయారి

3 కిలోల పచ్చిమిర్చి కాయలను తొడిమలు తీసి మెత్తగా రుబ్బి 10 లీటర్లనీటిలో రాత్రంతా నానబెట్టాలి. అరకిలో వెల్లుల్లి పాయలను బాగానూరి పావు లీటరు కిరోసిన్‌లో రాత్రంతా నానబెట్టాలి. వడకట్టిన మిరప, వెల్లుల్లి ద్రావణాలను రెండింటిని కలిపి దానికి 10 టీస్పూన్ల సబ్బుపొడిని పోసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని 4 గంటల తరువాత వడగట్టి 80 లీ॥ నీటిలో కలిపి ఎకరా పొలంలో పిచికారి చేయవచ్చు.

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.

☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990